www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| ఆదివారం | 16-03-2025 |

## పదేళ్లలో 85వేల ఉద్యోగాలక్కడ..!

## ఏడాదిలో 55వేల ఉద్యోగాలిక్కడ..!!

### సర్కార్ కొలువులపై మండలిలో కోదండరామ్ ఖుల్లంఖుల్లా...

(దండుగుల శ్రీనివాస్)



తెలంగాణ ఏర్పడ్డదే కొలువులు సాధన కోసం. ఒక సర్కార్ కొలువు ఆ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో.. ఆర్థిక పరమైన భరోసా ఎలా కల్పిస్తుందో సూటిగా వివరంగా చెప్పాడు ఎమ్మెల్సీ కోదండరామ్. మండలిలో ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ సర్కార్ కొలువులపై రెండు సర్కార్ల పనితీరుపై ఇచ్చిన వివరణ బాగుంది. ఆలోచిం పజేసేలా ఉంది. నిజాలే ఉన్నాయి. అబద్దాలు లేవు. ఆ ప్రభుత్వంలో ఏం చెప్పారు.. ఎన్ని సర్కార్ నౌకర్లిచ్చారు..? ఈ సర్కార్ ఏం చేసింది..? అని గణాంకాలతో సహా వివరించిన ఆయన... ఈ సర్కార్‌కు సర్కార్ ఉద్యోగాలపై సూచన చేయడం బాగుంది. నిరుద్యోగుల పక్షాన ఆయన మాట్లాడిన తీరు పార్టీలకతీతంగా ఆకట్టుకున్నది. పదేళ్లకాలం లో 1.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని చెప్పిన కేసీఆర్.. ఇచ్చింది 85వేల ఉద్యోగా లే. మధ్యలో నోటిఫికేన్ల జారీ.. పేపర్ల లీకేజీ లు.. పరీక్షలు ఆపేయడం.. నియామకాలు ఆగిపోవడం ఇవన్నీ సూటిగా సుత్తి లేకుండా చెప్పాడాయన.

# గరం గరం ఉష్ణోగ్రత...!

# రేవంత్ టెంపర్




గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంలా లేదది. కేసీఆర్‌పై తీన్మార్ వాయింపు దరువులా ఉంది. పదేళ్ల కేసీఆర్ పాలన పాపాల చిట్టా విప్పినట్టుంది. వారి తత్వాన్ని విడమర్చి చెప్పినట్టుగా ఉంది. పరిపాలన లోపాల శాపాలను ఎత్తిచూపినట్టుగా ఉంది. ఆనాటి పట్టింపులేనితనాన్ని పట్టుకుని సభలో బరిబాతల నిలబెట్టినట్టుంది. చేసింది గోరంత. చెప్పింది కొండంత. ఇది మొన్న కేటీఆర్ అన్నమాటలు. అవును.. నిజమే. ఇంకా చేయాల్సింది బాగానే ఉంది. దానికి టైమూ ఉంది. ఆలోపు చేయాల్సిన వాటిల్లో ఇచ్చిన హామీల్లో కొన్ని కొన్ని వస్తున్నాయి. ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ చెప్పుకోవడానికి ఓ సందర్భం. బాగానే దొరికింది. అంతకు మించి అడగడానికి, కడగేయడానికి, నిలదీయడానికి, గుర్తు చేయడానికి.. ఇంకో మంచి సందర్భంగా కూడా దొరికింది. అధికారంలో ఉన్నప్పుడు చాలా తప్పులు దొర్లుతాయి. దొర్లాయి.

## రేవంత్ పెంచిన పొలిటికల్ టెంపరేచర్..!!

(దండుగుల శ్రీనివాస్)

తెలియక చేసినవి కొన్ని. తెలిసి చేసివని ఎన్నో. అవే ఇక్కడి సభలో ఆయుధాలుగా మారాయి. అస్త్రశస్త్రాలు సంధించడానికి మంచి వేదికైందది. సమయం వచ్చినప్పుడు మీ సంగతి చూస్తా.. ఒక్కొక్కడి ఫామ్‌హౌజ్‌ల చిట్టాలు నా దగ్గరున్నాయనే గడుసుతనం... దబాయింపు ఓ వైపయితే.. అధికారంలో ఉన్నన్నాళ్లు చేసిన లోపాలు, అధికార పాపాలు గంపెడన్ని. ఇంకేం... తీన్మార్ దరువులో అది సమ్మగా వినిపించాయి అధికార సభ్యులకు. కర్ణకఠోరంగా, ఆముదం తాగినట్టుగా అనిపించింది ప్రతిపక్షానికి. ఇదేం బ్యాటింగ్. ఆపకుండా. నిరాఘాటంగా. నిరంతరాయంగా. నిర్మొహమాటంగా. నిర్భయంగా. వ్యక్తిగతంగా జోలికి పోనంటూనే నీకు నీ కుటుంబ సభ్యులతో ప్రాణాపాయముంది కాబట్టి.. నువ్వు సెక్యూరిటీ పెద్దగా పెట్టుకుని తిరుగుతున్నావని చెప్పకనే చెప్పడం. నువ్వు సభలో ఉంటే బాగుండు.. నాకు మంచి మంచి సలహాలిస్తుంటివి.. అని చెప్పకనే నా తాకిడికి నీ ముఖ కవళికలను నేరుగా చూసి సంబురపడుదును అనే కోరిక. రెండు సార్లే వచ్చాడు చూశావా...? ఇగో జీతం ఇంత తీసుకున్నాడు. ఈ పైసలు ప్రజల పైసలు కావా...? అంటూ జనాల ముందు దోషిలా నిలబెట్టాలనే ఆ తలంపు తెలిసిపోయిందందరికి.

### రోజా చేపల పులుసు ఘాటు..

కృష్ణా జలాల వాటాలో అన్యాయం చేసింది నువ్వు కాదా..? అయితే రా సభలోనే ఫేస్ టు ఫేస్ తేల్చుకుందామనే సవాల్.. వారిని మరింత ఇరకాటంలో పెట్టాలని చూసే ఆలోచన స్పష్టంగానే కనిపించింది. రోజా రొయ్యల పులుసు తినొచ్చి బంగారు రాయలసీమంటూ నోటిమట్ట అంటూ చేసిన వ్యాఖ్య వ్యంగ్యంగా ఘాటుగానే తాకింది.

- పైశాచికానందం..!
- కుల దురహంకారం..!!
- బరితెగింపుతనం..!!
- ఇది మీ నైజం.. మీ తత్వం..!!
- నిరుద్యోగులు...
- ఉద్యమకారులు..!
- అమరవీరులు....!!
- వీరిపై పట్టింపులేనితనం.. నిర్లక్ష్యం..!
- లోపాలెత్తి చూపి... పాపాల లెక్కలు చెప్పి...!!

## అవ్.. మోడీ బడేమియానే..

అవ్.. ఢిల్లీకి ఇంకా మూడొందల సార్లు పోతానని నోర్లుమూపిచ్చే ప్రసంగ ప్రయత్నం సఫలంగానే సాగింది. మోడీ బడేమియానే .. మళ్లోసారి చెప్పుతున్నానంటూ సమర్థింపు దబాయింపుల మేళవింపు సందర్భంగానే ఉంది. మార్చురీలోకి పొమ్మన్నది నిన్ను కాదు సుమా.. అన్నన్నా.. అంత మాటంటానా..? అని తాననలా అనలేదని, తప్పుప్పొకున్నట్టే ఒప్పుకుని తప్పుమాట్లాడలేదని తప్పుగా అర్థం చేసుకోవడం మీ తప్పుకాదా అని కూడా అడిగడం అదో బ్యాటింగ్. వ్యవస్థ దుర్వినియోగం, దుర్వ్యవస్థల ఏర్పాటు తోడ్పాటు అంతా మీ చలవే కాదా.. మేమే కదా ఇగో ఇలా దిద్దుకుంటూ సరిచేసుకుంటూ పోతున్నామని ఏకరువు పెట్టి వెల్లడించిన వైనం సబ్జెక్టుగానే ఉంది.

## నేను అప్పు తెచ్చింది 4,680 కోట్లే..


ఇక చివరగా అప్పులచిప్పుల పద్దుల గురించి. జాతిపిత తెచ్చిన అప్పులెన్ని..? వాటికి మిత్తీలెన్ని.. ఇప్పటి వరకు అసలు, మిత్తీలు కట్టేందుకు ఎన్ని అప్పులు తేవాల్సి వచ్చింది. అవిపోను అస్సలుగా నేను తెచ్చిన అప్పెంతో తెలుసా 4,680 కోట్లు. ఇదే క్లారిఫికేషన్. మొత్తానికి తెలంగాణ ప్రజల నెత్తి మీద ఇప్పటి వరకు ఉన్న అప్పుల మొత్తం లెక్క కూడా తెలసిం దండయో.. ఎంతో తెలుసా...? అక్షరాల 7, 38, 707 లక్షల కోట్లు.... నిండా మునిగినోళ్లం సలే లేదంటారా...! సరే ఉష్ణోగ్రతలు బాగా పెరిగినయ్ కదా. ఈ అప్పులెక్కనే.

## అమ్మాఅక్కా... ఆలీచెల్లీ... బూతులు మాట్లాడితే...!

## హద్దులు దాటి సుద్దులు చెబితే...!!

# బజారులో బరిబాతల బజాయిస్తాం...!!

### యూట్యూబర్లకు సీఎం మాస్‌వార్నింగ్...!




(దండుగుల శ్రీనివాస్)

యూట్యూబర్లకు సీఎం రేవంత్ మాస్ వార్నింగ్. యూట్యూబర్ల ముసుగులో జర్నలిస్టుల పేరుతో ఏది బడితే అది వార్తగా మలిచేయొచ్చు.. బూతుల వీడియోలు పెట్టొచ్చు.. సీఎం అని చూడకుండా, మంత్రులను లెక్కచేయకుండా అమ్మాఅక్క ఆలీ చెల్లి అంటూ బూతులు పోస్టు చేస్తే.. ఇక మీ భరతం పడతామన్నాడు. మామూలుగా కాదు. బజారులో బరిబాతల బట్టలిప్పి కొడతామని వార్నింగ్ ఇచ్చాడు. దీనిపై ఇటీవల ఓ జర్నలిస్టు అరెస్టయిన విషయం తెలిసిందే. అక్కడ అసభ్యకర వీడియోలు పోస్టు చేయడం మూలంగానే అరెస్టు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చిన సీఎం.. ఈ వైఖరి పరాకాష్టకు చేరిందన్నాడు. అడ్డూ అదుపు లేకుండా పోయిందని గుస్సా అయ్యాడు. హద్దులు దాటి సుద్దులు చెబుతున్నారని మండిపడ్డాడు. ఇకపై ఇలాంటివి చెల్లవన్నాడు. జర్నలిస్టులెవరో తేలాల్సిందేనన్నాడు. గుర్తింపు కార్డులు లేకపోతే..ఇక అంతే సంగతులనే వార్నింగ్ కూడా ఇచ్చేశాడు. జర్నలిస్టు సంఘాల నేతలకు సూచన చేశాడు. సేమ్ గతంలో మాదిరిగానే. జర్నలిస్టులెవరో..? వారి ముసుగులో ఉన్న అరాచకశక్తులెవరో తేలాల్సిందేనన్నాడు. కావాలంటే అసెంబ్లీలో చర్చకు పెడదామన్నాడు. సపరేట్ చట్టంతెస్తానన్నాడు. ఉన్న చట్టాలు కూడా మారుస్తానన్నాడు. ఇదంతా చేయిస్తుంది కేసీఆర్ అండ్ ఫ్యామిలీనేనని కూడా నిర్ధారించేశాడు. ఇది మానుకోవాలని వారికి ఈ వేదికగా హితవు పలికాడు.

# తిక్కలోడు తీన్మార్ మల్లి...!

### అసెంబ్లీ సాక్షిగా మల్లన్న పరువు తీసిన సీఎం..!!

(దండుగుల శ్రీనివాస్)



అప్పుడు చేరదీశారు. నెత్తికెత్తుకున్నారు. పెంచి పోషించారు. అధికారంలోకి రాగానే ఎమ్మెల్సీ ఇచ్చి సత్కరించుకున్నారు. ఊరేగారు. చట్టాపట్టాలేసుకు తిరిగారు. ఇప్పుడు ధిక్కరించారు. సస్పెండ్ చేశారు. ఏకంగా నిండు సభలో వాడో తిక్కలోడు అనే విధంగా అర్థమొచ్చేలానే ప్రవర్తించారు. బీసీ రిజర్వేషన్లు, కులగణన విషయంతో తీర్మాన్ మల్లన్న చెప్పిన మాటలు పట్టుకుని మీరు ఆగం అయి.. జనాలను తప్పుదోవ పట్టించే యత్నాన్ని తిప్పికొట్టే యత్నంలో మల్లి నిజస్వరూపం ఇది అనే విధంగా సీఎం ప్రసంగం కొనసాగింది. అప్పుడు మీ కుటుంబంపై మీ పై కూడా ఇంతకు మంచి ఏదేదో మాట్లాడాడు. వాటిని ఒప్పుకుంటున్నారా? నిజాలేనా? నమ్ముతున్నారా..? అందర్నీ నమ్మమంటున్నారా..? అయితే వాటిని అన్నీ తెచ్చి ఇక్కడ సభలో ప్రదర్శించండి.. వాటిని అంగీకరిస్తున్నట్టు ఒప్పుకోండి.. అప్పుడు అతగాడు చెప్పిన బీసీ వాదన గురించి మా తప్పుల గురించి మాట్లాడండని సీఎం చెప్పడం...ఒక్కదెబ్బకు రెండు పిట్టలన్నట్టు... మీ ఎమ్మెల్సీ, మీ మనిషి, మీ పార్టీ అనే వాదనకు, తీన్మార్ మాటలకు అంత సీన్ లేదు.. వాడో తిక్కలోడు. అప్పుడు మీ గురించి.. ఇప్పుడు ఈ ఇష్యూ గురించి రెండూ పసలేనివేనని తేటతెల్లం చేయడం. బీఆరెస్‌ను సెల్ఫ్ డిఫెన్స్‌లో పడేసినట్టుగానే ఉంది ఈ విషయంలో మాత్రం.



# కర్మ రిటర్న్స్

### కేసీఆర్‌కి రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

వాస్తవం, హైదరాబాద్:

బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయోగించిన భాషను తెలంగాణ సమాజమంతా వ్యతిరేకిస్తున్నది కాబట్టి తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ హుందాగా రాజకీయాలు చేస్తుందని, ముఖ్యమంత్రి ప్రయోగించిన భాషను తాము ప్రయోగించలేమని, కాబట్టి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

శాసనమండలి ఆవరణలో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ... ఇద్దరు మహిళా జర్నలిస్టులను అరెస్టు చేశారని, ఆ నేపథ్యంలో ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే బట్టలు ఊడదీసి ఊరేగిస్తామని అసెంబ్లీలో ముఖ్య మంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తెలంగాణ చరిత్రలో ఇది చీకటి రోజని స్పష్టం చేశారు. మహిళలను రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూనే, తన ఇంట్లోని మహిళలను తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూనే, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తానని అంటూనే ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయనకు తగదు అని సూచించారు.

గతంలో కేసీఆర్ గారితో పాటు తమ కుటుంబంలోని చంటి పిల్లలను కూడా వదిలిపెట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు అవి తిరిగి ముఖ్యమంత్రికే వస్తున్నాయని చెప్పారు. “మనం కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లం. ఇవాళ ఏం చేస్తామో మళ్ళీ అది మనకు వాపస్ వస్తుంది. గత ఐదు ఆరు సంవత్సరాల లో వాళ్లు చేసిన పనే తిరిగి వాళ్లకు చుట్టుకుంటున్నది. అది ఎవరు చేయిస్తున్నది కాదు. “అని వ్యాఖ్యానించారు.

మంత్రులు కూడా చాలా విచిత్రంగా మాట్లాడుతున్నారని, సభలో ఉంటే ఉండండి లేదంటే వెళ్లిపోండి అని చాలా దురుసుగా దురాహంకారంతోటి బిఆర్ఎస్ ఎమ్మెల్సీలను ఉద్దేశించి మాట్లాడారని విమర్శించారు.



## సోషల్ మీడియాను కేటీఆర్ అబద్ధాలకు వాడుతున్నాడు...!

- నా ఫోటోలు మార్ఫింగ్ చేసి ఆవేదనకు గురిచేశారు...!!
- అన్నా చెల్లెళ్లను తప్పుగా చూపిస్తున్నారు
- కుటుంబాలను బజారుకీడుస్తున్నారు
- కట్టడి చేయాల్సిన అవసరముంది
- మంత్రి సీతక్క ఆవేదన

# ఇది ప్రజాపాలన కాదు ప్రజలను వేధించే పాలన

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

వాస్తవం, హైదరాబాద్:



ఇది ప్రజాపాలన కాదని ప్రజలను వేధించే పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలన దేశ రాజకీయ చరిత్రలోనే మాయని మచ్చ అంటూ దుయ్యబట్టారు. ఆర్థిక పరిస్థితి మాకెందుకు తెలియదు, హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు.. సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచుతాం అని ప్రగల్భాలు పలికారు. కానీ 15 నెలల పాలనలో ఊదు గాలింది లేదు.. పీరు లేసింది లేదని ధ్వజమెత్తారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ 420 హామీలను చూసి మోసపోయాయని ఎక్స్ వేదికగా విమర్శించారు. “ఆర్థిక పరిస్థితి మాకెందుకు తెలియదు. హామీలన్నీ అమలు చేస్తాం అన్నారు. సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచుతాం అని ప్రగల్భాలు పలికారు. దొంగలు, దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు.. తెచ్చిన అప్పులను 20 శాతం కమీషన్లు దండుకుని బిల్లులు చెల్లిస్తున్నారు. ఇది ప్రజాపాలన కాదు. ప్రజలను వేధించే పాలన” అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.